RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

వరంగల్ | శుక్రవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 181 | జూన్ 13, 2025 | వెల : రూ.3-00

దినపత్రిక



మమ్మల్ని ఎవడ్రా
ఆపేది..!?

4లో..



## పేదవారికి అన్యాయం జరిగితే
# సహించేది లేదు

**మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి**

**వేద న్యూస్, హనుమకొండ :**

పేదవారికి అన్యాయం జరిగితే సహించేది లేదని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు తెలిపారు. గురువారం హనుమకొండ రాంనగర్లోని తమ నివాసంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలు హన్మకొండలోని తమ నివాసానికి చేరుకొని తమ సమస్యలను మాజీ ఎమ్మెల్సీ కొండా మురళికి విన్నవించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మాట్లాడుతూ అధికారుల తీరుపై మండిపడ్డారు. సమస్యల పరిష్కారం దిశగా అధికారుల నుంచి సరైన స్పందన లేని పక్షంలో తనకు తెలియజేయాలని వారికి సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని కొండా మురళి స్పష్టం చేశారు. అలాగే ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 14వ తేదీన వామపక్ష పార్టీలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్ నుండి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించబడుతున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావుని పాల్గొనాలని వామపక్ష నాయకులు ఆహ్వానించారు.



## జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో
# 50 శాతం రాయితీ

**ఉత్తర్వులు జారీ చేసిన డీఈవో**

**వేద న్యూస్, జయశంకర్ భూపాలపల్లి :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్ట్‌ల పిల్లలకు 50శాతం రాయితీ కల్పించాలని గురువారం టీ. ఎస్.జే.యూ.రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్(ఎన్.యూ.జే.ఇండియా) రాష్ట్ర ఆర్గనైజషన్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్,జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్,జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్ ల ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.రాజేందర్ కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన డి.ఈ.ఓ రాజేందర్ జిల్లాలోని ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలో జర్నలిస్టు పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ కల్పించేలా ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.జర్నలిస్టుల ఆర్థిక సమస్యలు దృష్టిలో ఉంచుకొని ఫీజు రాయితీ కల్పించిందుకు తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ పక్షాన జిల్లా కలెక్టర్ కు,జిల్లా విద్యాశాఖ అధికా రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీ.ఎస్.జే.యూ జిల్లా ఉపాధ్య క్షులు గట్టు రవీందర్,జిల్లా సంయుక్త కార్యదర్శులు కడపా క రవి,బొచ్చు భూపాల్,మీడియా ఇంచార్జ్ కారుకూరి సతీష్,జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు మారపాక చంద్రమౌళి,బొల్లపల్లి జగన్ తదితరులు వున్నారు.

## దేవుడి భూములను కబ్జా చేస్తే
# పీడీ యాక్ట్ పెడతాం..

2లో..

# కూలిన
# విమానం

## అతి పెద్ద విమాన ప్రమాదం

- గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ సహా పలువురు మృతి..
- మృత్యుంజయుడు ఒక్కరు..
- మృతులకు రూ.కోటి చొప్పున పరిహారం: టాటా గ్రూప్
- సమగ్ర దర్యాప్తు చేస్తాం: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు





**వేద న్యూస్, డెస్క్ :**

242 మంది ప్రయాణికులు, సిబ్బందితో సహా లండన్‌కు వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం గురువారం మధ్యాహ్నం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో కూలిపోయింది. ఇటీవల జరిగిన అతిపెద్ద విమాన ప్రమాదాలలో ఇది ఒకటి. అహ్మదాబాద్ నుండి గురువారం సుమారు మధ్యాహ్నం 1:38 గంటలకు బయలుదేరిన బోయింగ్ 787-8 విమానంలో 242 మంది ప్రయాణికులు మరియు సిబ్బంది ఉన్నారు. వీరిలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటిష్ జాతీయులు, 1 కెనడియన్ జాతీయుడు మరియు 7 మంది పోర్చుగీస్ జాతీయులు ఉన్నారు అని ఎయిర్ ఇండియా తన ఎక్స్ హ్యాండిల్‌లో పేర్కొంది. ఇది ఇలా ఉంటే అహ్మదాబాద్ విమానాశ్రయానికి సమీపంలోని మేఘనినగర్ ప్రాంతంలో విమానం కూలిపోయిందని పోలీసులు తెలిపారు. విమానం కూలిపోయిన తర్వాత మంటలు చెలరేగాయి మరియు మంటలను ఆర్పడానికి అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పౌర విమానయాన మంత్రి రామ్ మోహన్ నాయుడు ఘటన స్థలానికి చేరుకొని నిష్పాక్షికమైన మరియు సమగ్రమైన దర్యాప్తు చేయబోతున్నామని అన్నారు.

ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై

మిగతా 4వ పేజీలో..



# 11 ఏళ్లలో దేశం అభివృద్ధి చెందింది

- మహిళల ఆకాంక్షలకు రెక్కలు తొడిగిన మోదీ
- మోదీ 11 ఏళ్ల పాలనను 11ఏళ్ళ సేవగా నిర్వహిస్తున్నాం..
- ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

దేశ వ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధి పథకాలు, సాధించిన ఆర్థిక ప్రగతి ఫలాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య బిజెపి నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తాలోనికే కన్వెన్షన్ హాల్ లో కార్యక్రమ నిర్వహణ జిల్లా కన్వీనర్ కుసుమ సతీష్ అధ్యక్షతన గురువారం స్వతంత్ర భారతవని లో గత 11 సంవత్సరాల సూపరిపాలనపై సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ, వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలనపై ఏర్పాటుచేసిన ఫోటో గ్యాలరీ ఎగ్జిబిషన్ ని ప్రారంభించి వీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య మాట్లాడుతూ గ్రామగ్రామాన మోదీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేప్పాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు వారీ కుటుంబ సభ్యుల సంఖ్య ప్రకారం ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలన్నారు. 140 కోట్ల మంది భారతీయుల ఆశీస్సులతో, అందరి భాగస్వామ్యంతో మన దేశం వివిధ రంగాలలో వేగవంతమైన మార్పులకు



సాక్ష్యంగా నిలిచిందని, 'సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయాస్' అనే సూత్రాలతో నడుస్తున్న ఎన్డిఏ ప్రభుత్వం వేగంతో పాటు సున్నితత్వంతో మార్పులు తీసుకువచ్చిందని అన్నారు. ఆర్థిక వృద్ధి నుండి సామాజిక అభివృద్ధి వరకు, ప్రజలకు సంబంధించిన అందరినీ కలుపుకొనిపోయేతత్వంతో సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించామని తెలిపారు."మా సమష్టి విజయానికి మేం గర్విస్తున్నాము. అదే సమయంలో, వికసిత్ భారత్ ను నిర్మించడానికి ఆశ, విశ్వాసం, సంకల్పంతో ముందుకు సాగుతున్నాం. "దేశంలోని పలు రంగాలలో తీసుకువచ్చిన మార్పుల వివరాలను వెల్లడిస్తూ, అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలు, 'వికాస్‌వాద్'ను ప్రధాన స్రవంతిలోకి మోడీ తీసుకువచ్చారని, ఇది రాజకీయ చర్చ, 2014లో భారత ప్రధానిగా నరేంద్ర మోడీ పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి, 'దేశం ఫస్ట్' తన ప్రతి విధానానికి మార్గదర్శకంగా ఉందని అన్నారు. ఎన్డీయే హయాంలో దేశంలోని 81 కోట్ల మందికి పైగా ప్రజలు ఉచితంగా ఆహార ధాన్యాలు (రేషన్ బియ్యం) పొందుతున్నారు. 15 కోట్ల ఇళ్లకు పైగా నల్లా నీటి కనెక్షన్లు వచ్చాయి. అర్హులైన నిరుపేదల కోసం 4 కోట్ల ఇళ్లు నిర్మించాం. దేశవ్యాప్తంగా 12 కోట్ల మరుగుదొడ్లు నిర్మించాం..

మిగతా 4వ పేజీలో..

## తడి పొడి చెత్తను వేరుగా
# అందించాలి


- బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే

**వేద న్యూస్, హన్మకొండ :**

తడి పొడి చెత్తను వేరుగా అందించాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అన్నారు. గురువారం నగర పరిధి 43వ డివిజన్ పరిధి సత్యనారాయణ కాలనీ రంగశాయిపేటలో వంద రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గృహాల యాజమాన్యాలు తమ వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకు తడి పొడి చెత్తను వేరు చేసి విడిగా అందించాలని తడి చెత్తను ఇంటిలోనే మెన్యూర్ (ఎరువు) గా తయారు చేసుకొని ఇంటి లోని మొక్కలకు ఎరువుగా ఉపయోగించుకోవచ్చునని తద్వారా చెత్త పరిమాణాన్ని గణనీయంగా తగ్గించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదం అవుతుందని పొడి చెత్త యందు ప్లాస్టిక్ సంబంధ వ్యర్థాలను వేరు చేసి పరిశ్రమలకు పంపించడం జరుగుతుందని అన్నారు. చెత్తను డ్రైనేజ్ లలో వేయడం మురికి నీరు అక్కడే నిలిచిపోయి దోమల వ్యాప్తికి ఆస్కారం ఉంటుందని సమగ్ర శానిటేషన్ నిర్వహణకు ప్రజల నుండి సహకారం అవసరం అని ఈ సందర్భంగా కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ అరుణ విక్టర్, సిఎంహెచ్ఓ డా.రాజారెడ్డి, ఎంహెచ్ఓ డా.రాజేష్, శానిటరీ సూపర్ వైజర్ భాస్కర్, శానిటరీ ఇన్స్పెక్టర్ ఇస్రమ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# సామెతలతో హితబోధ శతకం పుస్తకావిష్కరణ

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**





మిర్యాలగూడ పట్టణంలోని విద్యానగర్ కాలనీ వరసిద్ధి వినాయక దేవాలయంలో బుధవారం భాషా ప్రవీణ వారణాసి ఆంజనేయులు రచించిన సామెతలతో హితబోధ శతకము పుస్తకావిష్కరణ కార్యక్రమం కవులు,కళాకారులు,తెలుగు భాష ప్రవీణులు,పండితుల హర్షధ్వానాల మధ్యన జరిగింది.సామెతలతో పద్యాలనేది ఎవరు చేపట్టని కొత్త ప్రక్రియగా తేలికైన పదాలతో 102 సామెతలతో చక్కటి పద్యాలను ఆటవెలదిలో రచయిత రాసినట్లు కార్యక్రమ అధ్యక్షులు అష్టావధాని కాటేపల్లి లక్ష్మీనరసింహమూర్తి తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృగశిర కార్తె పూర్ణిమలో ఏరువాక సాగుతున్నట్లుగా సామెతలతో హితబోధ శతకం అజరామర కీర్తిని పొందినట్లు వారు కొనియాడారు.

ఈ కార్యక్రమంలో గౌరవ అతిధులు తడకమళ్ళ రామచంద్రరావు,తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య వ్యవస్థాపకులు పులి కృష్ణమూర్తి శర్మ,వారణాసి కోటేశ్వర శర్మ, శ్రీధర శర్మ,నందికొండ చంద్రయ్య,పుల్లభట్ల లక్ష్మీనారాయణ శర్మ,లక్ష్మీ నరసయ్య,కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



# మమ్మల్ని ఎవడ్రా ఆపేది..!?

- అర్ధరాత్రి వేళ మట్టి తవ్వకాలు
- ఆయన ఒక్కసారి చెప్తే వందసార్లు చెప్పినట్టేనట
- రఘురామ..శివయ్య ఈ మాఫియాను అడ్డుకోలేరా? అంటున్న జనాలు
- విచ్చలవిడిగా ఎల్కుర్తిలో కొనసాగిస్తున్న మట్టి దందా..!
- చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు




**వేద న్యూస్, ఫోకస్ టీమ్ :**

ధర్మసాగర్ మండలం ఎల్కుర్తి గ్రామంలో మట్టి మాఫియా ఆగడాలు రోజురోజుకూ శృతి మించుతున్నాయి. అర్ధరాత్రి మట్టి తవ్వకాలు జోరుగా నడిపిస్తూ ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురిచేయడం షరా మామూలుగా మారింది. అయితే వీరిపై సంబంధిత శాఖ అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు లేకపోలేదు. ఓ ప్రభుత్వ స్కూలుకు సంబంధించిన భూములను సైతం ఇష్టానుసారంగా తవ్వకాలు జరిపి రోజుకు రూ. లక్షల్లో పోగు చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. అర్ధరాత్రి నుంచి ఉదయం7 గంటల వరకు మట్టి తవ్వకాలు జరిపి ఖాళీ స్థలంలో డంపింగ్ చేయడం.. ఉదయా నే అమ్ముకోవడం జరుగుతోంది. ఇదంతా రెవెన్యూ, పోలీసు, మైనింగ్, విజిలెన్స్,భూగర్భ జలశాఖ అధికారులకు తెలిసే..దర్జాగా నడుస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. "పుష్ప" సినిమాలో పుష్ప ఎర్రచందనాన్ని ఏలాగైతే మాఫియాగా తయారు చేశారో..అదేవిధంగా వీరు కూడా తమ దందాను దర్జాగా విచ్చలవిడిగా చట్టం అంటే భయం లేకుండా నడిపిస్తున్నారని విశ్వసనీయంగా తెలుస్తున్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ మట్టి మాఫీయాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

# ఇదెక్కడి అన్యాయం..?

– ఎస్సీ,బీసీలకు ప్రాధాన్యత లేని మంత్రిత్వ శాఖలు కేటాయించడం దుర్మార్గం

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

సామాజిక న్యాయం అని పేరు చెప్పి బలహీన వర్గాల వారికి ప్రాధాన్యత లేని శాఖలు,బడ్జెట్ లేని శాఖలు కేటాయించడం దుర్మార్గమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీలకమైన శాఖలు,బడ్జెట్ ఎక్కువ ఉన్న శాఖలు,పరిపాలన విధమైన శాఖలు అన్ని అగ్రవర్ణాల చేతిలో పెట్టుకొని పైసా ఉండని శాఖలను వివేక్ కు గనులు కార్మిక శాఖ,శ్రీహరి ముదిరాజ్ కు పశుసంవర్ధక మత్స్య క్రీడలు యువజన సర్వీసుల శాఖ,అట్లూరి లక్ష్మణ్ కు ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ సంక్షేమ శాఖలు ఎస్సీ,బీసీలకు కేటాయించడం న్యాయమా అని ఈ సందర్భంగా ప్రశ్నిస్తూ ఉన్నాం అన్నారు.ఇది చాలా దుర్మార్గమైన విషయం అన్నారు.కీలకమైనటువంటి హోం,మున్సిపల్,విద్యాశాఖలు సీఎం రేవంత్ రెడ్డి దగ్గర పెట్టుకొని ఏమి పనికిరాని శాఖలు ఎస్సీ,బీసీలకు కేటాయించడం ఎంతవరకు న్యాయమో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచించాలి.

# దేవుడి భూములు కబ్జా చేస్తే పీడీ యాక్ట్ పెడతాం

– రాష్ట్ర మంత్రి కొండా సురేఖ




**వేద న్యూస్, హైదరాబాద్ :**

రాష్ట్రంలో దేవాదాయ శాఖకు సంబంధించిన భూమిని కబ్జా చేసేవారిపై పీడీ యాక్టులు పెడతామని, అసలు దేవాదాయ శాఖకు చెందిన భూములు కబ్జా కాకుండా చూస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. దేవుడి భూములు పరిరక్షించడమే తమ ప్రభుత్వ ధ్యేయం అని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి దేవుడి భూములు కాపాడుతున్నట్టు మంత్రి వివరించారు. గురువారం మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచెర్లలో దేవాదాయ శాఖ భూమి అన్యాక్రాంతం అవుతున్నాయన్న ఫిర్యాదు మేరకు మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ జిల్లా రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచెర్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 33/8 లో 10.33 ఎకరాలు, సర్వే నెంబరు 33/9 లో 13 ఎకరాలు, సర్వే నెంబరు 33/10 లో 6.33 ఎకరాల చొప్పున మొత్తం 30.28 ఎకరాల భూమిని 1968 లో టీఎల్పీ చారిటబుల్ ట్రస్ట్ కు భూ పట్టదారులైన తోటకూర ఎల్లయ్య యాదవ్, రామయ్య చౌదరి తదితరుల ద్వారా సీలింగ్ యాక్ట్ నిబంధనల మేరకు సదరు భూమిని 1976 సంవత్సరంలో దేవాదాయ శాఖకు అప్పగించారని తెలిపారు. అప్పటి నుంచి ఈ భూమి దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నదని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ భూమిని కాపాడుతూ వచ్చాయన్నారు. అయితే, ఈ భూములను కబ్జా చేసేందుకు కొంతమంది పని చేస్తున్నారని మంత్రి ఆగ్రహించారు. దేవాదాయ శాఖ భూములు కబ్జాకు పాల్పడిందే ఎవరైనా సరే వదిలే ప్రసక్తే లేదని మంత్రి సురేఖ హెచ్చరించారు. అయినా, భూములను స్వాధీనం చేసుకొని కబ్జా దారులపై పీడీ యాక్ట్ పెడుతామని హెచ్చరించారు. మంత్రి వెంట పర్యటించిన వారిలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కీసర ఆర్డీవో ఉపేందర్ రెడ్డి, మేడిపల్లి తహసీల్దారు హసీనా, దేవాదాయ శాఖ సర్వేయర్లు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవాదాయ శాఖ అధికారులు ఈ భూములు పరిరక్షించేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. చెంగిచెర్ల భూములు, 1976లో టీఎల్పీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దేవాదాయ శాఖకు దక్కాయని గుర్తు చేశారు. అయితే, వీటిని కొంతమంది ప్రయివేటు వ్యక్తులు కబ్జా చేసి విల్లాల నిర్మాణాలు చేపడుతున్నట్టు తమకు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మార్వోతో కలసి కొంతమంది నకిలీ సర్వే చేయించి అక్రమంగా సొంతం చేసుకునే ప్రయత్నం చేసినట్టు వివరించారు. కాగా, తాజాగా ఏడీ సర్వే చేయించగా ఈ భూములన్నీ దేవాదాయ శాఖకు చెందిన భూములుగా తేలినట్టు మంత్రి సురేఖ చెప్పుకొచ్చారు. అయితే, ఈ కబ్జా అంశం, మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, జంగయ్య యాదవ్ వరంగల్ వెళ్తున్న మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి కొండా సురేఖ వెనువెంటనే రెవెన్యూ, దేవాదాయ, పోలీసు అధికారులను పిలిపించి తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌తోనూ ఫోన్‌లో మాట్లాడారు. దేవాదాయ శాఖకి చెందిన ఈ 30 ఎకరాల భూములను రక్షించి బార్ కోడ్ చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

# రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

–ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్




**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

ప్రతి ఏటా జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమిన ఏరువాక పౌర్ణమిగా జరుపుకోవడం సంప్రదాయం. అలాంటి సంప్రదాయాన్ని పాటిస్తూ ఎమ్మెల్యే బిఎల్ఆర్ దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పొలంలో దుక్కి దున్ని ఏరువాక కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభిం చారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కర్షకుల పండగ ఏరువాక పౌర్ణమి అని,ప్రకృతిని, భూమిని గౌరవించడం దీని ముఖ్యఉద్దేశ్యమని అన్నారు.వర్ష ఋతువు ఆరంభంలో తొలకరి చినుకు కోసం రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించడానికి ముందు భూమి పూజ చేస్తారని,నాగలి, ఎద్దులు, ఇతర సేద్యానికి సంబంధించిన పనిముట్లను పూజిస్తారని తెలిపారు.ఇది వ్యవసాయం, ప్రకృతి మధ్య సంబంధాన్ని గుర్తుచేస్తుందని అన్నారు. రైతులకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్,సాగునీరు,పెట్టుబడి సాయం,మద్దతు ధర ఇస్తుంద న్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, మండల నాయకులు,రైతులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యా వ్యవస్థను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దాలి

–బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే బిఎల్ఆర్,ఎమ్మెల్సీ శంకర్ నాయక్

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**




2025 విద్యాసంవత్సరం ప్రారంభం సందర్భంగా ప్రో. జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా గురువారం మొదటి రోజు మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లు పాల్గొని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ మరియు యూనిఫాం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బిఎల్ఆర్ దామరచర్ల మండలం వాడపల్లి గ్రామంలోని ప్రభుత్వ హై స్కూల్ లో దామరచర్ల మండల కేంద్రంలోనీ ప్రభుత్వ పాఠశాలలో పాల్గొని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు,నోట్ పుస్తకాలు మరియు యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి కృషి చేస్తూ విద్య కి పెద్దపీట వేస్తుందన్నారు. అందులో భాగంగానే గతంలో లాగా నిర్లక్ష్యం చేయకుండా మొట్టమొదటిసారి ప్రభుత్వ పాఠశాలల ప్రారంభ దినం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందజేసి మార్పునకు ముందడుగేశాము అని అన్నారు.అలాగే ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతం చేయడానికి ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకం అని అన్నారు.ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేస్తూ ప్రభుత్వ విద్యాసంస్థలను నెంబర్ వన్ స్థానంలో ఉంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కార్మికులకు పెంచిన వేతనాల బకాయిలు చెల్లించడం పట్ల హర్షం

– సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డబ్బికార్ మల్లేష్

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**



మున్సిపల్ కార్మికులకు పెంచిన వేతనాల బకాయిలు చెల్లించడం పట్ల సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డబ్బికార్ మల్లేష్ హర్షం వ్యక్తం చేశారు.గురువారం మిర్యాలగూడ పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు పోరాట ఫలితంగా అధికారులు దిగివచ్చి పెంచిన వేతనాల బకాయిలు మంజూరు చేశారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలని ఎన్నో ఏళ్లుగా సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.గతంలో మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని కానీ కొన్నాళ్లపాటు పెంచిన వేతనాలు అమలు చేయలేదని ఆరోపించారు. పెంచిన వేతనాల బకాయిలు చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళన చేశామని గుర్తు చేశారు.సంబంధిత మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేశామని స్థానిక సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ కు స్థానిక ఎమ్మెల్యేకు అనేకసార్లు వినతి పత్రాలు అందజేశామని చెప్పారు. పెంచిన వేతనాల బకాయిలు చెల్లించేలా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చామని తెలిపారు.దాని ఫలితంగా పెంచిన వేతనాల బకాయిలు మంజూరు చేశారని చెప్పారు.మున్సిపల్ కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పెంచిన వేతనాల బకాయిలు మంజూరు చేసినందుకు అధికారులకు,స్థానిక ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి,హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు తిరుపతి రామ్మూర్తి,తేలుకుంట్ల పాపిరెడ్డి,గుణగంటి రామచంద్ర, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## పదకొండేళ్లలో ఆర్థిక పతనం

ప్రధాని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు అయింది. ఆయన పాలన ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ ఆర్థిక విధానాల చుట్టూ కొనసాగుతూ ఉంది. రక్షణ, రైల్వేలతో సహా అనేక రంగాల్లో ఎక్కువ విదేశీ పెట్టుబడులను అనుమతించడానికి మోడీ ప్రభుత్వం భారతదేశ విదేశీ పెట్టుబడి విధానాలను సరళీకరించింది. దేశ, విదేశీ బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుకూలంగా దేశఆర్థిక విధానాలు అమలు చేస్తున్నది. ఫలితంగా దేశంలో ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, ఉపాధి సమస్య తీవ్రంగా ఉంది. భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చేందుకంటూ దేశ, విదేశీ కంపెనీలు దేశంలో ఉత్పత్తులు తయారు చేయటాన్ని ప్రోత్సహించడానికి 2014 సెప్టెంబర్‌లో మోడీ ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా' ప్రవేశ పెట్టింది. దీని ద్వారా విదేశీ కార్పొరేట్ సంస్థలు భారత మార్కెట్‌లో ఎక్కువ వాటాను స్వాధీనం చేసుకోవటానికి వీలు కల్పించింది. 'మేక్ ఇన్ ఇండియా' (%మీుఎవ అఅ ×అ౦ఋ%) లక్ష్యం తయారీ రంగం వృద్ధి రేటుని సంవత్సరానికి 12.14% పెంచటం, 2022 నాటికి జిడిపికి తయారీ రంగం వాటాను 25% పెంచటం. (తర్వాత దీన్ని 2025కి సవరించారు) 2022 నాటికి ఆర్థిక వ్యవస్థలో 100 మిలియన్ల అదనపు తయారీ ఉద్యోగాలు సృష్టించటం. వీటిని సాధించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. 2022 నాటికి జిడిపి తయారీ రంగం వాటా 25 శాతానికి చేరుకుంటుందని అంచనా వేయగా, 2013-14లో 16.7% ఉండగా, 2023- 24 నాటికి 15.9 శాతానికి జిడిపి పడిపోయింది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించకపోగా, ప్రభుత్వ రంగ సంస్థల్లోని లక్షలాది ఉద్యోగాలు తొలగించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందినట్లు మోడీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. ఆర్థిక వ్యత్యాసాల్లోనూ, అప్పులు చేయడంలోనూ, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడంలోనూ, పేదరికంలోనూ, ఉద్యోగాలు కల్పించకపోవటంలోను మోడీ ప్రభుత్వం సాధించిన అభివృద్ధి మాత్రం వాస్తవం.

నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు జరుపుతున్న ఆర్థిక విధానాలు కేవలం శత కోటీశ్వర్లకు మేలు చేయగా, పేదలకు తీవ్ర సమస్యలు సృష్టించింది. 2015లో భారత్ లో శత కోటీశ్వర్లు 97 మంది ఉండగా, ప్రస్తుతం వారి సంఖ్య 210 కి చేరింది. దీన్ని గమనిస్తే దేశ సంపద పేదల దరి చేరలేదనేది సుస్పష్టం. ఒక శాతం భారత జనాభా వద్ద 40 శాతం సంపద ఉంటే, 50 శాతం ఉన్న పేద వర్గాల వద్ద కేవలం 3 శాతం సంపద ఉంది. మోడీ ఆర్థిక విధానాలు పేదలను పేదలుగానే ఉంచింది. 2011 నుంచి ప్రభుత్వం పేదరికం, ఉపాధిపై అధికార డేటా ప్రకటించక పోవటంతో భారత ఆర్థిక పరిస్థితులను అంచనా వేయటం సాధ్యం కావటం లేదు. భారత ప్రభుత్వ గణాంక సంస్థ పేదరికం, ఉపాధిపై నిర్వహించే సర్వేలు నమ్మదగినవి కావని విశ్లేషకులు అభిప్రాయపడు తున్నారు. 2014లో మోడీ అధికారంలోకి వచ్చే నాటికి దేశానికి రూ. 84 లక్షల కోట్ల అప్పు ఉంది. ఇందులో స్వదేశీ అప్పు రూ. 47.34 లక్షల కోట్లు కాగా, విదేశీ అప్పులు రూ. 37.4 లక్షల కోట్లు కాగా, 2025 నాటికి దేశం రూ. 224 లక్షల కోట్ల అప్పులకు చేరింది. ఇందులో స్వదేశీ అప్పులు రూ. 166.57 లక్షల కోట్లు కాగా, విదేశీ అప్పులు 57.4 లక్షల కోట్ల రూపాయలుగా ఉంది. మోడీ అధికారం చేపట్టిన తర్వాత అంతర్జాతీయ మార్కెట్‌లో మన రూపాయి విలువ బాగా దిగజారింది. మోడీ అధికారంలోకి వచ్చే నాటికి అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌కు రూపాయి విలువ 60 రూపాయలుగా ఉంటే, మోడీ పాలనలో ఇప్పుడు 86 రూపాయలుగా ఉంది. తాజా లెక్కల ప్రకారం ఆహార సూచికలో ప్రపంచంలోని 127 దేశాల్లో భారత దేశం 105 స్థానంలో ఉంది. మోడీ అధికారంలోకి వచ్చిన 10 సంవత్సరాల కాలంలో దేశ ఆకలి సూచిక స్కోరు 28.8 నుంచి 27.38కి మారింది.

అదే కాలంలో పాకిస్తాన్‌లో స్కోర్ 29.8 నుండి 27.98 తగ్గింది. దేశ తలసరి ఆదాయంలో భారత్ 136వ స్థానంలో ఉండగా, అతిపేద దేశం శ్రీలంక 133వ స్థానంలో ఉంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రకారం భారత ఆర్థిక వ్యవస్థ 2024లో 6.5%తో అభివృద్ధి చెందుతుందని అంచనా వేయబడింది. ఇది మరే ఇతర దేశాల ఆర్థిక వ్యవస్థల కన్నా ఎక్కువగా ప్రచారం చేయబడుతున్నది. అది వాస్తవం కాదు. 1987లో చైనా భారత ఆర్థిక ఆదాయం 0.27 ట్రిలియన్ల డాలర్లతో సమానంగా ఉన్నాయి. 2025 నాటికి భారత జిడిపి 4.19 ట్రిలియన్ డాలర్లు కాగా, చైనా జిడిపి 19.23 ట్రిలియన్ డాలర్లు. అంటే భారత్ కన్నా నాలుగు రెట్లు పైగా ఎక్కువ. ప్రస్తుతం చైనా తలసరి ఆదాయం 13,687 డాలర్లు కాగా, భారత తలసరి ఆదాయం 2,880 డాలర్లు మాత్రమే. పేదలకు ఈ ఆదాయం కూడా లేదు. దీన్ని గమనిస్తే భారత ఆర్థిక వ్యవస్థ పెరుగుదల వాస్తవ రూపంలో లేదని అర్థమవుతుంది.

11 సంవత్సరాల మోడీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను, ఆస్తులను పెద్ద ఎత్తున అమ్మకాలకు పెట్టారు. దీన్ని సమర్థించుకోవటానికి, ప్రభుత్వం వ్యాపారం చేయదని అది ప్రభుత్వ విధానం కాదని, ప్రభుత్వ సంస్థలను, ఆస్తులను అమ్మి ఆ డబ్బులను ప్రజాసంక్షేమానికి ఉపయోగిస్తామని చెప్పటంలో వంచన దాగి ఉంది. ప్రధాని మోడీ ఒక విషయాన్ని మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ సంస్థలు, ఆస్తులు ప్రజా సంక్షేమం కోసం ఉన్నవే గాని లాభాల కోసం ఏర్పాటు చేసినవి కాదు. ప్రజా సంక్షేమం పట్టని మోడీ ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలను, ఆస్తులను బడా పెట్టుబడిదారులకు కారుచవకగా అమ్ముతున్నది. తొలి ఐదు సంవత్సరాల పాలనలో ప్రభుత్వ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, ప్రభుత్వ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా 3 లక్షల కోట్ల రూపాయలను మోడీ ప్రభుత్వం పొందింది. మలి విడత పాలనలో 1.5 లక్షల కోట్లను పొందింది. ఈ విధంగా ప్రభుత్వ రంగ సంస్థలను, ఆస్తులను ప్రైవేట్ సంస్థల పరం చేస్తున్నది. మొండి పారు బకాయిల పేరుతో బడా పారిశ్రామిక వేత్తలు బ్యాంకులకు చెల్లించాల్సిన దాదాపు రూ. 14 లక్షల కోట్ల అప్పులను రద్దు చేయడం మోడీ ప్రభుత్వ విధానాలకు అద్దం పడుతున్నది. మోడీ ప్రభుత్వ విధానాల ఫలితంగా వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉంది.

# టేకాఫ్ అయిన ఐదు నిమిషాలకే దుర్ఘటన

## కూలిన విమానంలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్ పౌరులు




**డెస్క్:**

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గురువారం మధ్యాహ్నం ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలింది. ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం ఏఐ171, అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 1:38 గంటలకు లండన్ గ్యాట్విక్‌కు టేకాఫ్ అయింది. అయితే, గాల్లోకి ఎగిరిన కేవలం ఐదు నిమిషాల వ్యవధిలోనే విమానం కుప్పకూలింది. ప్రమాద వార్త తెలియగానే సహాయక బృందాలు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. విమానం కూలిపోతున్న దృశ్యాలు కొన్ని ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి. అవి చూపరులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఈ దుర్ఘటనపై ఎయిర్ ఇండియా ఒక ప్రకటన విడుదల చేసింది. "ప్రమాద సమయంలో విమానంలో 242 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. వీరిలో 169 మంది భారతీయ పౌరులు, 53 మంది బ్రిటిష్ పౌరులు, ఏడుగురు పోర్చుగీస్ జాతీయులు, ఒక కెనడియన్ జాతీయుడు ఉన్నారు" అని ఎయిర్ ఇండియా తెలిపింది. "గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలిస్తున్నాం" అని పేర్కొంది. ప్రయాణికుల బంధువులు, కుటుంబ సభ్యుల సమాచారం కోసం ప్రత్యేకంగా ఒక హాట్‌లైన్ నంబర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు ఎయిర్ ఇండియా వెల్లడించింది. "మరింత సమాచారం అందించేందుకు 1800 5691 444 అనే ప్రత్యేక ప్యాసింజర్ హాట్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేశాము," అని పూర్తిస్థాయి సేవలందించే ఈ విమానయాన సంస్థ తన ప్రకటనలో జోడించింది. ఈ ప్రమాదం నేపథ్యంలో అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి అన్ని విమాన సర్వీసులను తదుపరి ప్రకటన వెలువడే వరకు తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది. కాగా, ప్రమాదం జరిగిన తీరు చూస్తే, విమానంలోని వారు బతికి బయటపడే అవకాశాలు స్వల్పం అని తెలుస్తోంది. ప్రస్తుతం సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి.

# భారీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన టాటా గ్రూప్!



**డెస్క్:**

యావత్ దేశం ఉలిక్కిపడేలా ఘోర విమాన ప్రమాదం చోటు చేసుకుంది. గురువారం మధ్యాహ్నం అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఎయిర్ ఇండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం కుప్పకూలిపోయింది. లండన్‌కు వెళ్తున్న విమానం నగరం లోని మేఘాని ప్రాంతంలోని ఓ మెడికల్ కాలేజీ హాస్టల్‌పై కూలిపోయింది. ఆ సమయంలో భారీ పేలుడు సంభవించింది. గాల్లోకి భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ప్రకారం.. విమానంలో 241 మంది ఉన్నారు. అందులో 230 మంది ప్రయాణికులు, 2 పైలట్లు, 10 మంది క్యాబిన్ సిబ్బంది ఉన్నారు. విమానం కెప్టెన్ సుమీత్ సభర్వాల్, ఫస్ట్ ఆఫీసర్ క్లైవ్ కుందర్ ఆధ్వర్యంలో ఉంది. కాగా ఈ ప్రమాదంలో మరణించిన వారికి టాటా గ్రూప్ భారీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి పరిహారం ఇవ్వనున్నట్లు టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ ప్రకటించారు. అలాగే విమాన ప్రమాద సమయంలో దెబ్బ తిన్న మెడికల్ కాలేజీ బిల్డింగ్ ను కూడా పునర్మిస్తామని కూడా తెలిపారు.



# గుజరాత్ సీఎంకు అమిత్ షా ఫోన్

**ఇంటర్నెట్ డెస్క్:**

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ మధ్యాహ్నం పెను విషాదం చోటుచేసుకుంది. 242 మంది ప్రయాణికులతో లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయిన క్షణాల వ్యవధిలోనే కుప్పకూలింది. ఈ ఘటన దేశ వ్యాప్తంగా కలకలం రేపింది. జనావాసాల మధ్య విమానం కూలిపోయింది. విమానం కూలిన వెంటనే ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. దీంతో ఆ ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగ అలుముకుంది. కిలోమీటర్ల దూరం వరకు ఈ పొగలు కనిపించడంతో ప్రజలు భయాం దోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, ఇతర సహాయక బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ విమాన ప్రమాద ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన వెంటనే గుజరాత్ ముఖ్యమంత్రి, రాష్ట్ర హోంమంత్రి, పోలీస్ కమిషనర్‌లతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. బాధితులకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని, అవసరమైన పూర్తి సహాయం అందిస్తామని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు.

# ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ



**డెస్క్:**

అహ్మదాబాద్ విమాన ప్రమాదం ఘటన మహావిషాదమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. మృతుల్లో చిన్నారులు సైతం ఉన్నారన్నారు. ఈ విమాన ప్రమాద ఘటన తెలిసిన వెంటనే గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అహ్మదాబాద్ చేరుకున్నారు. అనంతరం విమాన ప్రమాద ఘనట చోటు చేసుకున్న ప్రదేశానికి ఆయన చేరుకుని.. ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. విమాన ప్రమాద ఘటన తీరును ఉన్నతాధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో పరిశీలన కోసమే తాను అహ్మదాబాద్ వచ్చినట్లు తెలిపారు. ఈ విమాన ప్రమాద ఘటన దురదృష్టకరమని ఆయన అభివర్ణించారు. అన్ని విభాగాల సమన్వయంతో సహాయక చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ ప్రమాద ఘటనపై పూర్తి స్థాయిలో నిష్పాక్షికమైన సమగ్ర దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు.



విమాన ప్రమాదం ఎందుకు జరిగిందో దర్యాప్తు చేస్తామన్నారు. విమాన ప్రమాద బాధ్యులను ఉపేక్షించమని కేంద్రం మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ సందర్భంగా ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అయితే మృతుల సంఖ్యలను కనుగోనవలసి ఉందిని ఉందన్నారు. ఈ విమాన ప్రమాదంలో మాజీ సీఎం విజయ్ రూపానీ కూడా ఉన్నారని తెలిసి చాలా బాధగా ఉందని తెలిపారు. ఈ విమానంలో ఇతర దేశాలకు చెందిన జాతీయులు సైతం ఉన్నారని చెప్పారు. ఈ విషాదకరమైన, భయంకరమైన సంఘటనతో తాను పూర్తిగా షాక్ అయ్యానన్నారు. తాను ఇప్పటికీ షాక్‌లోనే ఉన్నానని తెలిపారు. ప్రధానమంత్రి మోదీ తనకు ఫోన్ చేసి సంఘటన స్థలంలో ఉండమని కోరారని వివరించారు. ఈ సమయంలో, నేను ప్రయాణీకులు, వారి కుటుంబాల గురించి మాత్రమే ఆలోచించగలనన్నారు. అనేక సంస్థలు సహాయక చర్యలలో నిమగ్నమై ఉన్నాయని గుర్తు చేశారు. బాధితులకు అన్ని రకాల సహాయం అందిస్తున్నామన్నారు. మరోవైపు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అహ్మదాబాద్ చేరుకున్నారు. ఆయన సైతం సంఘటన స్థలానికి వచ్చారు. ప్రమాద ఘటనపై ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడారు. సహాయక చర్యలపై ఆరా తీశారు.

# ఘటన స్థలంలో అందినకాడికి దోపిడీలు!

**డెస్క్:**

అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం -171, టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలకే కుప్పకూలింది. ఈ దుర్ఘటనతో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేశారు. విమానం నేరుగా ఇంటర్న్ డాక్టర్లు నివసిస్తున్న ఓ రెసిడెన్షియల్ హాస్టల్‌పై పడటంతో భారీ అగ్నిప్రమాదం సంభవించి, ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే, విమానం రెక్క మేఘాని నగర్ సమీపంలోని బహుళ అంతస్తుల ఇంటర్న్ డాక్టర్ల హాస్టల్ భవనంలోని మూడు, నాలుగు మరియు ఐదో అంతస్తులను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనతో భారీగామంటలు చెలరేగాయి. యాభై మందికి పైగా ఉంటున్న హాస్టల్ భవనాన్ని అగ్నికీలలు చుట్టుముట్టాయి. ఇందులో యువ వైద్య ఇంటర్న్‌లు, వారి కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు. మంటల తీవ్రతకు కొందరు లోపలే చిక్కుకుపోగా, మరికొందరు ప్రాణాలు కాపాడుకునేందుకు పై అంతస్తుల నుంచి కిందకు దూకేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఘటనా స్థలంలో హృదయ విదారక దృశ్యాలు కనిపించాయి. "ఓ వ్యక్తి తన బిడ్డ ప్రాణాలు కాపాడేందుకు నాలుగో అంతస్తు నుంచి కిందకు విసిరేశాడు" అని ఓ స్థానికుడు కన్నీటిపర్యంతమయ్యాడు. అదే అంతస్తు నుంచి దూకిన ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. భవనంలో మంటలు వ్యాపిస్తుండటంతో చాలా మంది కిటికీల నుంచి దూకడం కనిపించింది.



## తెలంగాణ ఎరుకల ప్రజా సమితి హన్మకొండ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాధాకృష్ణ

**వేద న్యూస్, హన్మకొండ :**

తెలంగాణ ఎరుకల ప్రజా సమితి హన్మకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పులిచేరు రాధ కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నిక చేసి నియామక పత్రాలు అందజేసిన తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పులిచేరు రాధకృష్ణ మాట్లాడుతూ.. ఎరుకల జాతి చైతన్యం కోసం ఎరుకల ప్రజా సమితి మరియు ఎరుకల మహిళా సమితి బలోపేతం కోసం ఎరుకల ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పోరాటం చేస్తామని ఎరుకల ప్రజానీకానికి పిలుపునిచ్చారు. అలాగే తనకు పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి, సంపత్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పాఠ్యపుస్తకాలు యూనిఫార్మ్స్ పంపిణీ

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం గ్రామం ఎంపీపీ ఎస్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం పాఠశాల ప్రారంభ దినాన్ని పురస్కరించుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.స్వరూప ఎస్తేరు అధ్యక్షతన మెగా పిటిఎం పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ విక్టర్ హాజరయ్యారు. పాఠశాల ప్రారంభమైన సందర్భంగా పూలతో బెలూన్స్ తో పండుగ వాతావరనం ఉట్టిపడేలా ఆహ్లాదకరమైన వాతావరణం లో విద్యార్థినీ విద్యార్థులకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొనగా కార్పొరేటర్ ఈదురు అరుణ విక్టర్ అలాగే ఏఏపిసి చైర్మన్ ఎన్ నాగలక్ష్మి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు యూనిఫార్మ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు, బి.కవిత అంగన్వాడి సూపర్వైజర్ స్వప్న అలాగే స్థానిక అంగన్వాడీ టీచర్లు రాజెల్లు, రజిత తదితరులు పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా అందరూ కృషి చేయాలని ప్రభుత్వ పాఠశాలల గొప్పతనాన్ని ప్రజలకు తెలిసేలా చైతన్యపరచాలని కోరారు.



## ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం

**వేద న్యూస్, నర్సంపేట :**

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే బాధ్యత అందరి మీద ఉంది అని మండల విద్యాశాఖ అధికారి కొర్ర సారయ్య అన్నారు. మండలంలోని మహేశ్వరం గ్రామంలో గల జడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి కొర్ర సారయ్య,ప్రధానోపాధ్యాయులు స్వరూప ఆధ్వర్యంలో ప్రైమరీ సరితాబాయి మహేశ్వరం పాఠశాల నుండి 10 మంది విద్యార్థులను చేర్పించారు.అలాగే ఎంఈవో సారయ్య చేతుల మీదుగా విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ యూనిఫామ్స్ పంపిణీ జరిగింది. ఉపాధ్యాయులు సారయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ విద్యా బోధన జరుగుతుంది. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, రెండు జతలు బట్టలు, మధ్యాహ్న భోజన సౌకర్యం, గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్, ఆహ్లాదకరమైన పాఠశాల వాతావరణం, ఒత్తిడి లేని నాణ్యమైన విద్య అందించబడుతుందని అన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, ప్రతి మూడవ శనివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించ పడుతుందన్నారు. కావున విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి మీ ఆర్థిక భారాన్ని తగ్గించుకోండి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల టీచర్స్ పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

- **క్రమశిక్షణతో ఉంటూ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి**
- **బాలలకు తరగతిగదితోనే ఉజ్వల భవిష్యత్తు**
- **జిల్లా ఎస్పీ కె. నరసింహా**

**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**



ఈ విద్యా సంవత్సరం పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న సందర్భంగా గురువారం సూర్యాపేట పట్టణంలో ప్రభుత్వ నెంబర్.2 ఉన్నత పాఠశాలను జిల్లా ఎస్పీ నరసింహా సందర్శించారు. అనంతరం విద్యార్థులకు స్వాగతం తెలుపుతూ వారితో ఆప్యాయంగా పలకరించి మాట్లాడారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, మిఠాయిలు, పూలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సమాజాన్ని మంచి మార్గంలో నడిపే వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని పేర్కొన్నారు.తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు, దేవుడు ప్రసాదించిన వరం ఉపాధ్యాయులు అన్నారు. బాలలకు తరగతి గదిలోనే ఉజ్వలమైన భవిష్యత్తు ఉందన్నారు. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలకు చదువుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ చదువుకుంటూనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించబడినడి, 14 సం.రాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పోలీస్ టీమ్స్ పని పనిచేస్తున్నాయని అన్నారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ప్రతి బుధవారం పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం నిర్వహిస్తూ పౌరులు సన్మార్గంలో నడవాలని తెలిపారు.మంచిని బోధిస్తూ పోలీసుగా మేము కూడా ఉపాధ్యాయునీ వలె పని చేస్తున్నామని అన్నారు. ప్రజలకు చట్టాలు, శిక్షలు సత్ప్రవర్తన పై అవగాహన కల్పిస్తున్నామన్నారు.విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదువుతే ఉన్నత స్థాయికి ఎదగవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మాతృభూమికి మంచి పేరు తేవాలి, ప్రజలకు సేవలు అందించే విధంగా ఎదగాలన్నారు. చాలా సంత్సరాల క్రితం చదువుకోవడానికి సరియైన వసతులు లేవు ఇప్పుడు పరిస్తితి మారాయి.. ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక వసతులు కల్పించి ఉన్నతమైన నాణ్యమైన సాంకేతిక విద్య అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎన్నో నైపుణ్యాలతో విద్యను బోధిస్తున్నారన్నారు.

విద్యార్థులు మంచి పుస్తకం, మంచి స్నేహితున్ని ఎంచుకుంటే చాలా సాధించవచ్చు అన్నారు. నేను కూడా మారుమూల పల్లెటూరులో ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పని చేశాను, ఇప్పుడు ఐపీఎస్ అధికారిగా మీ ముందుకు వచ్చానని ఎస్పి తెలిపారు. జిల్లాలో రాష్ట్రంలో ఉన్న ప్రముఖులు, విద్యావంతులు, అధికారులు చాలావరకు అందరూ ప్రభుత్వ పాఠశాలలో చదివి వచ్చినవారే అన్నారు. విజయం సాధించిన వారి జీవితాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

ఈ పాఠశాలలో చదివి ఈ సంవత్సరం 10వ తరగతిలో మంచి మార్కులు తెచ్చుకుని ప్రతమ స్థానం విద్యార్థికి రూ.10,116 ద్వితీయ స్థానం విద్యార్థికి జిల్లా పోలీసు శాఖ తరపున 5116 రూపాయల బహుమతిగా ప్రకటించారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ యం.ఉదయ శ్రీ, సిఐ రాజశేఖర్, ఎస్ ఐ ఏడుకొండలు, సాయిరాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**జిల్లా కార్య నిర్వహణ అధికారి విద్యాలత**

**వేద న్యూస్, కమలాపూర్ :**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం భీంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆర్థిక సంవత్సరం పున ప్రారంభం కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కార్యనిర్వహణాధికారి విద్యాలత హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులు కల్పన, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, పాఠశాల చుట్టూ పరిసర ప్రాంతాల పరిశుభ్రత, అంగన్వాడి కేంద్రంలోని పిల్లలకు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందిస్తున్న తీరును, విద్యా విధానాన్ని గురించి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేయగా సమావేశాన్నుదేశించి విద్యాలత మాట్లాడుతూ 14 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలందరినీ తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివే విధంగా తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు క్రీడలు అన్ని రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్ది వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తాయని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ, ఉచితంగా స్కూల్ యూనిఫామ్, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు కల్పిస్తున్నటువంటి విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు వారి ఇంటికి వెళ్లి అర్థమయ్యేలా వారికి చెప్పి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించేలాగా చొరవ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు పాఠశాలలకు పంపించి లక్షల రూపాయలు ఖర్చు పెట్టి ఆర్థికంగా నష్టపోతున్నారని అలా నష్టపోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా విద్యతో పాటు సకల సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థులకు పోషకాహార లోపం ఉండకూడదనే ఉద్దేశంతో పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం కూడా అందించి శారీరకంగా వారిని దృఢంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని ఈ సందర్భంగా జిల్లా కార్యనిర్వహణాధికారి కోరారు. ఆ తదుపరి విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్, పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో కమలాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు, మండల విద్యాధికారి కే శ్రీధర్, సముదాయ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి వాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి వీరస్వామి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామైక్య సంఘాల సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 11 ఏళ్లలో దేశం అభివృద్ధి చెందింది

**మొదటి పేజీ తరువాయి**

68 లక్షల వీధి వ్యాపారులకు రుణాలు ఇచ్చాం. స్మార్టప్స్, చిన్న వ్యవస్థాపక సంస్థలకు ఏకంగా 52.5 కోట్ల రుణాలు ఇవ్వడంతో పాటు కరోనా సమయంలో 20 కోట్ల మంది మహిళలకు పలు పథకాల ద్వారా నగదు సహాయం అందించమని తెలిపారు. బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ మాట్లాడుతూ రాజకీయంగా మహిళలు ఎదగాలని చట్టసభలో వారి భాగస్వామ్యం ఉండాలనే లక్ష్యంలో బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో మహిళా బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం పొందించిందని ఇది మహిళలందరు గర్వించదగిన విషయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ అన్నారు. దేశంలోనే అత్యున్నతమైన పదవిని మహిళకు కట్టబెట్టిన ఘనత బీజేపీదేనని వివరించారు. ప్రధాని మోదీ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలనే ఉద్దేశంలో ముద్రలోన్లు, ఉజ్వల గ్యాస్ పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ప్రవేశపెట్టారన్నారు. ముస్లిం మహిళలకు త్రిపుల్ తలాక్ రద్దు చేసి వారి సంక్షేమం కోసం కృషి చేశారని వివరించారు. మహిళలకు అండగా ఉండే పార్టీ బీజేపీనేనని వివరించారు. మహిళలు అన్నింటా ముందుండాలనే లక్ష్యంతో మోడీ సర్కార్ నారీ శక్తి వందన్ ను తీసుకొచ్చిందన్నారు. రాజకీయం, విద్యా, ఉద్యోగం ఇలా అన్నింటిలో మహిళలు చరిత్ర సృష్టించాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. నారీ శక్తి వందన్ చట్టం విధాన, చట్టాల రూపకల్పనలో మహిళల భాగస్వామ్యానికి ప్రధాన అవరోధాన్ని తొలగిస్తుందని, సమ్మిళిత పాలన యొక్క కొత్త శకాన్ని తెరపైకి తెస్తుందని చెప్పారు. బీజేపీ మాతృశక్తి ఆశీర్వదం కలిగి ఉందన్నారు. శక్తి వందన్ అభియాన్ కింద అభివృద్ధి చెందిన భారతదేశం అనే సంకల్పంతో దేశవ్యాప్తంగా 10 కోట్ల మందికి పైగా మహిళలను అనుసంధానం చేయాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కోటి స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను సంప్రదించి 10 కోట్ల మందికి పైగా మహిళలకు ఉపాధి లభించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. తదనంతరం జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ ఎన్నో చారిత్రాత్మక విజయాలతో మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకొని ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిన భారత్ అని వరంగల్ జిల్లా బిజెపి అధ్యక్షులు గంట రవికుమార్ అన్నారు. 11 సంవత్సరాల మోదీ ప్రభుత్వం దృఢ సంకల్పంతో సాకారమైన అనేక లక్ష్యాలను గురించి, ఆయన నాయకత్వంలో బిజెపి కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన అద్భుతమైన పథకాలను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉంటుంది అన్ని దానికి అనుగుణంగా మున్సిపల్ లో ప్రతి బూత్ స్థాయి వరకు మోడీ కార్యక్రమాలను పథకాలను తీసుకువెళ్లాలని ఈ సమావేశంలో సూచన చేయడం జరిగింది.దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమర్థవంతమైన నిర్ణయాత్మక నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. వికసిత్ భారత్ లక్ష్యం సహకారం దిశగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతుంది అని అన్నారు. ఎన్నో చారిత్రాత్మక విజయాలతో మోది ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది అని, ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకొని యావత్ దేశం గౌరవ ప్రధానమంత్రి అభినందనలు తెలుపుతుంది అని అన్నారు. అదేవిధంగా ఆపరేషన్ సీందూర్ మరియు చారిత్రాత్మక విజయం సాధించిన నేపథ్యంలో శక్తివంతమైన భారతదేశంలో చూసి యావద్దేశం గర్విస్తుందని కొనియాడారు. ఆపరేషన్ సిందూర్లో మన బలగాలు ప్రదర్శించిన ధైర్య సాహసాలు ప్రతి భారతీయుడికి గర్వకారణం, మన బలగాలు సరిహద్దు అవతల ఉన్న ఉగ్రవాద శిబిరాలను అత్యంత ఖచ్చితత్వంతో ధ్వంసం చేయడం అద్భుతం, ఉగ్రవాదంపై పోరుకు ఆపరేషన్ సింధూర్ ప్రపంచవ్యాప్తంగా కొత్త ఒరవడిని సృష్టించింది అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్, మాజీ శాసనసభ్యులు ఆరురి రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, రత్నం సతీష్ షా, నర్సంపేట కంటెస్టెడ్ కంభంపాటి పుల్లారావు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, డాక్టర్ గోగుల రాణా ప్రతాపరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జేల శ్రీరాములు, కార్యక్రమ కో- కన్వీనర్ ముంద్రాతి వెంకటేశ్వర్లు, జిల్లా, మండల, పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# కూలిన విమానం

**మొదటి పేజీ తరువాయి**

కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్ మోహన్ నాయుడు కింజరపు మాట్లాడుతూ, “మేము న్యాయమైన మరియు సమగ్రమైన దర్యాప్తు చేయబోతున్నాము మరియు ఈ సంఘటన ఎందుకు జరిగిందో దర్యాప్తు చేస్తాము. మనం ఇంకా సంఖ్యలను కనుగొనవలసి ఉంది. గుజరాత్ మాజీ సీఎం విజయ్‌రూపానీ కూడా అక్కడ ఉన్నారని తెలిసి చాలా బాధగా ఉంది. అలాగే ఇతర జాతీయులు కూడా ఉన్నారన్నారు. ఈ విషాదకరమైన మరియు భయంకరమైన సంఘటన నన్ను పూర్తిగా కదిలించింది. నేను ఇప్పటికీ షాక్‌లోనే ఉన్నాను. ప్రధానమంత్రి నాకు ఫోన్ చేసి సంఘటన స్థలంలో ఉండమని కోరారు. ఈ సమయంలో, నేను ప్రయాణికులు వారి కుటుంబాల గురించి మాత్రమే ఆలోచించగలను. అనేక సంస్థలు సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నాయి. మృతుల సంఖ్య గురించి నేను ఇంకా ఏమీ చెప్పదలచుకోలేదు. మేము అన్ని విధాలుగా సహాయం అందిస్తున్నాము.మేము న్యాయమైన మరియు సమగ్రమైన దర్యాప్తు చేయబోతున్నాము. ఈ సంఘటన ఎందుకు జరిగిందో లోతుల్లోకి వెళ్తాము అని అన్నారు.

### గుజరాత్ మాజీ సీఎం విజయ్‌రూపానీ మృతి :కేంద్రమంత్రి సీఆర్ పాటిల్

విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సీఎం విజయ్‌రూపానీ మృతి చెందారని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ వెల్లడించారు. 2016 నుంచి 2021 వరకు గుజరాత్ సీఎంగా పనిచేసిన విజయ్‌రూపానీ.. 1956 ఆగస్టు 2న మయన్మార్‌లో జన్మించిన విజయ్‌రూపానీ. 1960లో రాజ్‌కోట్‌కు వలస వచ్చిన విజయ్‌రూపానీ కుటుంబం.

### మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం: టాటా గ్రూప్

విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ప్రతి వ్యక్తి కుటుంబానికి రూ.కోటి చొప్పున పరిహారం ప్రకటించిన టాటా గ్రూప్. గాయపడిన వారి వైద్యఖర్చులు భరిస్తామని, వారికి అవసరమైన సాయం అందజేస్తామని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ ప్రకటన చేశారు. విమాన ప్రమాదంలో దెబ్బతిన్న బీజే వైద్యకళాశాల హాస్టల్ పునర్నిర్మాణానికి అండగా నిలుస్తామని వెల్లడించారు.

### విమాన ప్రమాదం నుంచి ఒకరు బయటపడ్డారు: అహ్మదాబాద్ సీపీ

11ఏ నంబర్ సీటులోని ప్రయాణికుడు ప్రమాదం నుంచి బయటపడినట్లు అహ్మదాబాద్ సిపీ తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ప్రమాద మృతుల సంఖ్య గురించి ఇప్పుడే ఏమీ చెప్పలేమన్నారు. నివాస ప్రాంతంలో కూలినందువల్ల మృతుల సంఖ్య ఎక్కువే ఉంటుందని సీపీ వెల్లడించారు.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073